పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

యువకుడిని సన్మానిస్తున్న నాయకులు

బోధన్, జూన్ 9: పట్టణంలోని రాకాసీపేట్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) ఉపాధ్యాయులు రాచప్ప, వసీం సుల్తానాలు కాలనీలో అవగాహన కల్పించారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. బడీడు పిల్లలతో పనులు చేయిస్తే, విద్యాహక్కు చట్టం ప్రకారం పిల్లల తల్లిదండ్రులు, పనులు చేయించుకుంటున్న వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మధ్యలో బడి మానివేసిన వారిని కూడా పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. రాకాసీపేట్‌లోని 10వ వార్డులో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న యువకుడికి సన్మానం

రాకాసీపేట్‌లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

వేల్పూర్, జూన్ 9: అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న వేల్పూర్‌కు చెందిన గుగిల అశోక్‌ను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తనను ప్రోత్సహిస్తున్న గ్రామస్తులు, వర్కర్స్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయడంపై నగరంలో బీజేపీ నాయకులు ఆదివారం సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.
– వినాయక్‌నగర్, జూన్ 9

ఘనంగా బోనాల పండుగ

బాల్కొండలో వలగొడుగుతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

ఖానాపూర్‌లో..

సారంగాపూర్/ సిరికొండ/ బాల్కొండ/ ఏర్గట్ల/ ఇందల్వాయి, జూన్ 9 : జిల్లాలోని పలు గ్రామాల్లో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నగర శివారులోని ఖానాపూర్‌లో గ్రామస్తులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పంటలు బాగా పండాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ మహిళలు డప్పు వాయిద్యా మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించారు. బేడిలమ్మ పోచమ్మ ఆలయం వరకు చేరుకొని, అమ్మవారికి బోనాలు, నైవేద్యాలను సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కోర్వ రాజేంద్రప్రసాద్, మహేందర్, సందీప్, విజయేందర్, నవీన్, సాయికుమార్, శ్రీనివాస్, సుమన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలోని చీమన్‌పల్లి, పందిమడుగు గ్రామాల్లో గ్రామస్తులు పోచమ్మకు బోనాలను సమర్పించారు. వివిధ కుల సంఘాలకు చెందిన మహిళలు బోనాలను డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు. అమ్మవారికి నైవేద్యం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బాల్కొండ మండలకేంద్రంలో గంగనీళ్ల జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అన్ని ఆలయాల్లోని దేవతా విగ్రహాలకు గంగనీళ్లతో అభిషేకం చేశారు. డప్పువాయిద్యా మధ్య వలగొడుగును ఊరేగించారు. పంటలు బాగా పండాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని జాతర నిర్వహించినట్లు గ్రామ సదర్ సల్ల నర్సయ్య తెలిపారు.

ఏర్గట్ల మండల కేంద్రంలో జంగల వారి, బర్మ వారి ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లికి బోనాలను సమర్పించారు. ఆయా సంఘాల సభ్యులు సార్గమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళ హారతులు, డప్పువాయిద్యాల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వన భోజనాలకు తరలివెళ్లారు.

ఇందల్వాయి మండలంలోని అన్సాన్‌పల్లి, మల్లాపూర్ తదితర గ్రామాల్లో పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం, పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు వనభోజనాలకు తరలివెళ్లారు.

ఖానాపూర్‌లో బోనాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

మేరు కుల విద్యార్థులను సన్మానిస్తున్న మేవా ప్రతినిధులు

ఆర్మూర్‌లో దేవాంగ సంఘం విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్వర్

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత

సుభాష్‌నగర్/ ఖలీల్‌వాడి/ఆర్మూర్‌టౌన్, జూన్ 9 : పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన మేరు కులానికి చెందిన 24 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం అందజేశారు. జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్‌లో ఉన్న మేరు భవనంలో మేరు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (మేవా) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సభాధ్యక్షుడిగా మేవా అధ్యక్షుడు కీర్తి సుదర్శన్ వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతీ సంప్రదాయాలను అలవర్చుకోవాన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను సన్మానించి, పురస్కారాలను అందజేశారు. సోమ హన్మంత్‌రావు, గంగాకిషన్, పోల్కం గంగాధర్, కొట్టూర్ దేవదాస్, కొట్టూర్ చంద్రకాంత్, మంతెన దశరథ్, ఎన్ను సుదర్శన్, ఢీకొండ సుధీర్, రాయి మోహన్, లక్ష్మణ్, కొట్టూరి గంగాధర్, అనిల్, ప్రసాద్, భాస్కర్, సాయిబాబా, శ్రీనివాస్, సుజాత, సూర్యప్రకాశ్, ఢీకొండ తిరుపతి పాల్గొన్నారు.

పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా దేవాంగ విద్యా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్ హాజరై విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. చౌల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 15 మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున పారితోషకం అందజేశారు. దేవాంగ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట బందోబస్తు

నగరంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ కల్మేశ్వర్

వినాయక్‌నగర్, జూన్ 9: నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాలను కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ సింగేనవార్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉదయం 10 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా.. జిల్లాలోని 41 సెంటర్ల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. అభ్యర్థులను, హాల్‌టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే వారిని కేంద్రంలోనికి అనుమతించారు. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి పర్యవేక్షణలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, నగర సీఐ నరహరి, నిజామాబాద్ సౌత్, నార్త్ రూరల్ సీఐలు సురేశ్, సతీశ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణతో పాటు ఎస్సైలు, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీస్ సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు

'డైట్ ప్రిన్సిపాల్‌పై విచారణ చేపట్టాలి'

ఖలీల్‌వాడి, జూన్ 8 : నగరంలోని డైట్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌పై విచారణ చేపట్టాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి కర్క గణేశ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ట్రైనీలు, సిబ్బందిని ప్రిన్సిపాల్ మానసికంగా వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం డైట్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్కూల్ యూనిఫామ్స్ అందజేత

రుద్రూర్‌లో ఏకరూప దుస్తులను అందజేస్తున్న ఐకేపీ పీడీ సాయాగౌడ్

ఎడపల్లి/రుద్రూర్, జూన్ 9: జానకంపేట్, నెహ్రూనగర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు డీఆర్డీవో సాయాగౌడ్ స్కూల్ యూనిఫామ్‌ను ఆయా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పాఠశాలలో విద్యార్థులకు మొదటి విడుతలో 3841 జతల యూనిఫామ్స్ అందజేశామని అన్నారు. రెండో విడుత యూనిఫామ్‌ను అగస్టులో అందజేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం సాయిలు, హెచ్ఎంలు ఉన్నారు. రుద్రూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులను ఐకేపీ పీడీ సాయాగౌడ్ ఏకరూప దుస్తులను ఆదివారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఐకేపీ మహిళలతో కుట్టించిన ఏకరూప దుస్తులను పరిశీలించి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల, ఎంపీపీఎస్ బాలికల పాఠశాలకు దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం రాచయ్య, ఎంఈవో శాంతకుమారి, ఏపీఎం భాస్కర్, సీసీలు నాగరాజు, స్వాతి పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఐఐటీ అడ్వాన్స్‌లో 'కాకతీయ' విద్యార్థుల ప్రతిభ

ఖలీల్‌వాడి, జూన్ 9 : ఐఐటీ అడ్వాన్స్ జాతీయ పరీక్షా ఫలితాల్లో కాకతీయ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తొలి ప్రయత్నంలోనే జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారు. కాకతీయ విద్యాసంస్థల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, డైరెక్టర్ రామోజీరావు, రాజా, తేజస్విని ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. మిన్హాజ్ 438, తేజస్విని 856, సుప్రీత్ 3407, కీర్తన 3740, సిద్ధార్థ 4906, హాదీ 5102 ర్యాంకులు సాధించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ రణదీప్, సందీప్ కులకర్ణి, వైస్ ప్రిన్సిపాల్ శ్యాం జోత్స్నాను అభినందించారు.

తేజస్విని

సుప్రీత్

కీర్తన

సిద్ధార్థ

జోరుగా చేపల విక్రయం

మోర్తాడ్, జూన్9: మృగశిర కార్తెను పురస్కరించుకుని ఆదివారం కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో చేపల విక్రయం జోరుగా సాగింది. మృగశిరకార్తె శనివారం రావడంతో ఎక్కువ మంది ఆరోజు మాంసా హారం తినేందుకు ఆసిక్తి చూపరు. దీంతో గంగపుత్ర సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జోరుగా చేపలు విక్రయించారు.

ఘనంగా మృగశిర కార్తె

ధర్పల్లి,జూన్9: ధర్పల్లి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో మృగశిర కార్తె వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. మృగశిర కార్తె సందర్భంగా గ్రామదేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. మృగశిర కార్తె నుంచి రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టడం ఆనవాయితీ. మార్కెట్‌లో చేపలకు భారీగా డిమాండ్ ఏర్పడింది.

కమ్మర్‌పల్లిలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ఇతిహాస సంకలన సమితి వార్షిక సమావేశం

ఇతిహాస సమావేశంలో పాల్గొన్న నగరవాసి ఆనంద్

సుభాష్‌నగర్, జూన్ 9: ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర వార్షిక సమావేశాన్ని హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేసిందని జిల్లా సమన్వయకర్తలు నరేశ్‌కుమార్, కందకుర్తి ఆనంద్ తెలిపారు. గతేడాది వార్షిక యోజన రివ్యూతోపాటు రానున్న సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంశాలను చేపట్టాల్సిన అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఇతిహాస సంకలన సమితి జాతీయ సంఘటన కార్యదర్శి బాల ముకుంద్ పాండే హాజరై చరిత్ర అంటే వయస్సు మళ్లిన వారు మాత్రమే అధ్యయనం చేసే అంశం కాదని, భవిష్యత్తు తరాలు తమ గతాన్ని గురించి తెలుసుకోవడం అని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ ధ్యానం చేయాలి

మాట్లాడుతున్న ట్రస్ట్ సభ్యురాలు

నందిపేట్, జూన్ 9: ప్రతిరోజూ ధ్యానం చేయాలని మహేశ్వర మహా పిరమిడ్ ట్రస్ట్ సభ్యురాలు శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని వెల్మల్ గ్రామంలో పీఎస్ఎస్ఎం నవనాథపురం ఆధ్వర్యంలో అహింసాయుత మహాకరుణ మెగా శాఖాహార ర్యాలీ, ఆనంద ఆదివారం, ధ్యానాత్మ జ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీలక్ష్మి హాజరై ప్రసంగించారు. ప్రతిఒక్కరూ పిరమిడ్ మెడిటేషన్ ఛానల్ చూడాలని, ధ్యానం చేసి ఆత్మజ్ఞానాన్ని పొందాలని, ధ్యానంతో ఎన్నో లాభాలున్నాయని అన్నారు. కార్యక్రమంలో ధ్యాన బంధువులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్, జూన్9: దళిత హక్కుల పోరాట సమితి జిల్లా జనరల్ బాడీ సమావేశం ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు తాళ్లపల్లి లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో సంఘాన్ని గ్రామాల్లో బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 18, 19, 20 తేదీల్లో యాదగిరి గుట్టలో నిర్వహించనున్న రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. కరపత్రాల ఆవిష్కరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సుభాష్‌నగర్/ పొతంగల్, జూన్ 9 : జిల్లాలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేంద్రంలోని ఆర్యనగర్‌లో ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరాలయం వార్షికోత్సవం సందర్భంగా లక్ష్మీపూజలు నిర్వహించారు. వేద పండితుడు శ్రీధరాచార్యులు మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. బోర్గాం (పీ)లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో శ్రీసూక్త పారాయణం, హోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అరుణ్‌కుమార్ శర్మ మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీ సూక్త లక్ష్మీ యజ్ఞం పూర్ణాహుతితో సంపూర్ణమైనట్లు తెలిపారు. పొతంగల్ మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్వామి వారికి హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బోర్గాం (పీ) జడ్పీహెచ్ఎస్ 2003-04 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

కోటగిరి/ పొతంగల్/ ఖలీల్‌వాడి (మోపాల్), జూన్ 9 : జిల్లాలోని పలు పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. చాలా ఏండ్ల తర్వాత స్నేహితులందరూ ఒకేవేదికపై కలవడంతో భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబీకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని, రోజంతా సందడిగా గడిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. బోర్గాం (పీ) గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ 2023-24 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బోర్గాం (పీ)లోని కిసాన్ మున్నూరు కాపు సంఘం ఇందుకు వేదికైంది.

కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006-2007 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పొతంగల్ మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2003-04 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఒకే వేదికపై కలిసి సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

26 ఏండ్ల తర్వాత..

ఆర్మూర్‌టౌన్ పట్టణంలోని విజయ్ పబ్లిక్ స్కూల్‌లో 1997-98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఓ పంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. 26 ఏండ్ల తర్వాత అందరూ ఒకచోట కలుసుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నట్లు తెలిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

పొతంగల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు

ఆర్మూర్‌లో 26 ఏండ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దరఖాస్తుల ఆహ్వానం

ఇందల్వాయి, జూన్ 9 : డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో తెలుగు, కెమిస్ట్రీ, స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, జేఎల్‌ల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ గీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఈడీ, పీజీ పూర్తి చేసి, 3 సంవత్సరాల అనుభవం ఉండాలని, స్టాఫ్ నర్సు కోర్సులో బోధించేందుకు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, ఏడాది అనుభవం ఉండాలని పేర్కొన్నారు. వివరాలకు 9440140330 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

రామోజీరావుకు నివాళి

రెంజల్/ఎడపల్లి, జూన్ 9: రెంజల్ మండలంలోని సాటాపూర్‌లో ఆదివారం ఈనాడు దినపత్రిక అధినేత రామోజీరావు మృతికి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎడపల్లిలోని ప్రెస్ క్లబ్‌లో పాత్రికేయులు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు

నేడు పిల్లలకు స్వర్ణామృతం పంపిణీ

నందిపేట్, జూన్ 9: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమంలో పిల్లలకు సోమవారం స్వర్ణామృతం పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో 15 ఏండ్లలోపు పిల్లలకు జ్ఞాపకశక్తి, తెలివితేటల పెరుగుదలకు ఆయుర్వేద ఔషధం, స్వర్ణమృతాన్ని పిల్లలకు ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ చోరీ

నవీపేట, జూన్ 9: మండల కేంద్రంలో కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు బైకుల చోరీలకు పాల్పడుతున్నారు. రెండు రోజుల క్రితం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట నుంచి మండల కేంద్రానికి చెందిన మల్లేశ్‌కు చెందిన మోటార్ సైకిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు కాలేదు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై యాదగిరిగౌడ్ పేర్కొన్నారు. బైకుల చోరీలను అరికట్టేందుకు పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు పాఠ్య పుస్తకాల పంపిణీ

రెంజల్, జూన్ 9: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో గణేశ్‌రావు కులకర్ణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని ఎంపీపీ లోలపు రజిని, జడ్పీటీసీ మేక విజయా సంతోష్ అందజేస్తారని పేర్కొన్నారు.